సాక్షి
జనగామ

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



గుడిమెలిగె.. భక్తి ఉప్పొంగె

మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో బుధవారం గుడిమెలిగె పండుగ ఆదివాసీ సంప్రదాయం ప్రకారం వైభవంగా జరిగింది. - 8లో▸



ఉద్యోగ కల్పన లక్ష్యం కావాలి

ఉద్యోగం ఒక్కటే కాదు.. ఉద్యోగ కల్పన లక్ష్యంగా ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
35°/19°

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అధిక వేడి, ఉక్కపోత ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

వేంకటేశ్వరుడికి వెండి పుష్పాల మాల..



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన కొరివి సాయికృష్ణ –దివ్యవిశిష్ట దంపతులు 234 గ్రాముల వెండితో తయారు చేసిన పుష్పాల మాలను సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యాన అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులకు బుధవారం అందజేయగా ప్రత్యేక పూజలు చేశారు.

ఖైదీలకు చట్టాలపై అవగాహన ఉండాలి



జనగామ రూరల్: ఖైదీలకు చట్టాలపై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బుధవారం సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించిన ఆయన జైలులో కల్పిస్తున్న వసతులు, భోజనంతో పాటు ఆరోగ్య సమస్యలపై ఖైదీలతో మాట్లాడి ఆరా తీశారు. జైలు సిబ్బందితో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఏమైన కంప్లైంట్స్ ఉంటే బాక్స్ ఉందని.. సమస్యలు రాసి అందులో వేయాలని సూచించారు. బెయిల్ వచ్చి విడుదల కానివారు ఉన్నారా అని అడిగిన జడ్జి.. బెయిల్ గ్రాంట్ అయి విడుదల కాని వారందరి విషయం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ దృష్టికి తీసుకురావాలని సబ్ జైల్ సూపరింటెండెంట్ కృష్ణ కాంత్‌కు సూచించారు.

సరోత్తంరెడ్డి గెలుపునకు కృషి చేయాలి



జనగామ రూరల్: శాసనమండలి ఉపాధ్యాయ ఎన్నికల్లో పులి సరోత్తంరెడ్డి గెలుపునకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేశ్ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో నాగపురి రాజలింగం, ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య, తోకల ఉమారాణి, దుబ్బ రాజశేఖర్, శివరాజ్ యాదవ్, సురేశ్‌గౌడ్, రంగు రాములు, కన్వీనర్ కొంతం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు పెరుమాడ్ల వెంకటేశ్వర్లు, మహేందర్‌రెడ్డి, పెద్దోజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు బుధవారం నిర్వహించారు. 50 పాఠశాలల నుంచి 14, 16 18, 20 ఏళ్ల వయసు బాలబాలికలు 300 మంది పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన 25 మంది అక్టోబర్ 17, 18 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందిశెట్టి మనోజ్‌కుమార్, ఆవుల అశోక్, ఆదెపు శ్రీనివాసు, దిలీప్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలకు 133 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో బుధవారం నిర్వహించిన ఇంటర్ ప్రయోగ పరీక్షలకు 133 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ కె.జితేందర్‌రెడ్డి తెలిపారు. జనరల్, ఒకేషనల్ మొదటి సెషన్ 1,157 మంది విద్యార్థులకు 91 మంది, రెండో సెషన్‌లో 941 మందికి 42 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పాలకుర్తి, కొడకండ్ల కళాశాలలను డీఐఈఓ, స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట కళాశాలలను డెక్ సభ్యులు సందర్శించారు.

సరస్వతీ.. నమస్తుభ్యం!



సరస్వతి నది పుష్కరాలను పురస్కరించుకుని ముక్కంటి కొలువైన కాళేశ్వరం సరికొత్తగా ముస్తాబు కానుంది. మే 15 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.25 కోట్లు కేటాయించింది. వీటితో ఏయే పనులు చేయాలో జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా నిర్దేశించి, కలెక్టర్ రాహుల్ శర్మ నియమించిన కన్సల్టింగ్ కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ జీఎస్‌వీ సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలోని 'క్షేత్ర'సంస్థ మాస్టర్ ప్లాన్ తయారుచేసింది. పుష్కరాల ఏర్పాట్లపై 'సాక్షి' ముందస్తుగా అందిస్తున్న ప్రత్యేక కథనం..

- భూపాలపల్లి

హిందూ పురాణాల్లో సరస్వతి నదిని అంతర్వాహినిగా పేర్కొంటారు. ఉత్తరాది ప్రజలు ప్రయాగ్‌రాజ్ దగ్గర గంగ, యమునా నదులు కలిసే చోట సరస్వతీ నది అంతర్వాహినిగా కలుస్తుందని నమ్ముతారు. మన దగ్గర దక్షిణ గంగగా పేర్కొనే గోదావరి, ప్రాణహిత నదుల సంగమ స్థానమైన కాళేశ్వరంలో సరస్వతీ నది అంతర్వాహినిగా కలుస్తుందని భక్తుల నమ్మకం. స్థల పురాణం ప్రకారం కాళేశ్వరం ఆలయంలో శివుడికి అభిషేకం చేసిన జలం ప్రత్యేక మార్గం గుండా ప్రవహించి ప్రాణహిత–గోదావరి సంగమ ప్రదేశం దగ్గర కలుస్తుందని, ఈ ప్రవాహం అంతర్వాహినిగా ఉండటం వల్ల సరస్వతీ నదిగా పేర్కొంటారు. దీంతో దక్షిణ భారతదేశంలో సరస్వతి పుష్కరాలు కాళేశ్వరానికి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.

ఈసారి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

కాళేశ్వరం గోదావరిలో త్రివేణి సంగమం

- అంతర్వాహినిగా కలిసే సరస్వతి నది
- మే 15 నుంచి 26 వరకు పుష్కరాలు
- వీఐపీ ఘాట్ దగ్గర శాశ్వత ప్రాతిపదికన పనులు
- ఈసారి ప్రత్యేక ఆకర్షణగా జాయ్‌రైడ్, టెంట్‌సిటీ, కల్చరల్ ఫెస్టివల్స్
- క్షేత్ర సంస్థ ఆధ్వర్యంలో సిద్ధమైన మాస్టర్‌ప్లాన్

150 మీటర్ల మేర కొత్తగా స్నానఘట్టాలు..

2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలోని గోదావరి తీరంలో ప్రధాన స్నానఘట్టాలకు దూరంగా వీఐపీ ఘాట్ నిర్మించారు. ఈ పదేళ్లలో ఇక్కడ ఈ ఘాట్ తప్ప మరో సౌకర్యం లేదు. సరస్వతి పుష్కరాల సందర్భంగా వీఐపీ ఘాట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపనున్నారు.

- ప్రస్తుతం ఉన్న స్నానఘట్టాల పక్కన కొత్తగా 150 మీటర్ల పొడవుతో కొత్త స్నానఘట్టాలు నిర్మించనున్నారు.
- ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన టాయిలెట్స్, వాష్‌రూమ్స్ అందుబాటులోకి తేనున్నారు. దీంతోపాటు తాత్కాలిక ప్రాతిపదికన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు, టాయిలెట్స్ నిర్మించనున్నారు.
- వీఐపీల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్లాట్, ఆ వాహనాలు సులువుగా రాకపోకలు చేసేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న సీసీ రోడ్డు విస్తరణ, మట్టి రోడ్డు స్థానంలో కొత్తగా రోడ్డు నిర్మించనున్నారు.
- ఇక్కడే బస చేయాలనుకునే వారి కోసం టెంట్ సిటీ కూడా ఏర్పాటు చేయనున్నారు.
- అద్దె ప్రాతిపదికన గుడారాలు బుక్ చేసుకుని త్రివేణి సంగమ ప్రదేశం దగ్గర భక్తులు బస చేయవచ్చు.
- ముఖ్యంగా వెదురు గుడారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

జాయ్‌రైడ్..

సరస్వతి నది పుష్కరాలను పురస్కరించుకుని ఈసారి జాయ్‌రైడ్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇందుకోసం కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో ఉన్న మూడు హెలిపాడ్లను సిద్ధం చేయనున్నారు.

- మహారాష్ట్రలోని సిరొంచ నుంచి కాళేశ్వరం వచ్చే మార్గంలో బ్రిడ్జి దాటాక (కన్నెపల్లి సమీపంలో) హెలిపాడ్‌ను జాయ్‌రైడ్‌కు కేటాయిస్తుండగా, మిగిలిన హెలిపాడ్లు వీఐపీల కోసం ఉంచనున్నారు.
- జాయ్‌రైడ్‌లో హెలికాప్టర్ ద్వారా పార్వతి బరాజ్ (మేడిగడ్డ) బ్యాక్ వాటర్, కన్నెపల్లి పంపుహౌస్, సిరొంచ (మహారాష్ట్ర) మీదుగా సంగమ ప్రదేశం మీదుగా చక్కర్లు కొడుతూ కాళేశ్వరం ఆలయాన్ని పైనుంచి చూస్తూ మహదేవపూర్ అడవుల అందాలను వీక్షించవచ్చు. దీనికి ఇంకా టికెట్ ధర నిర్ణయించలేదు.
- హరిత హోటల్‌లో ఫుడ్ ఫెస్టివల్, ప్రధాన ఆలయ సమీపంలోని ఖాళీ స్థలంలో కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా..



ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల పార్కింగ్ కోసం మూడు స్థలాలను ఎంపిక చేశారు. కాటారం –మహదేవపూర్ నుంచి వచ్చే భక్తుల కోసం కాళేశ్వరం దగ్గరలోని ఇప్పలబోరు సమీపంలో 3.29 ఎకరాలు, ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో 5.07 ఎకరాలు, మహారాష్ట్రలోని సిరొంచ నుంచి వచ్చే వాహనాలకు కన్నెపల్లి సమీపంలో 2.12 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయనున్నారు.

త్రివేణి సంగమం వరకు ప్రత్యేక దారి..

పుష్కరాలను పురస్కరించుకుని మూడు నదులు కలిసే సంగమ ప్రదేశం దగ్గర భక్తులు స్నానాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఇందుకోసం ప్రధాన ఘాట్‌తోపాటు వీఐపీ ఘాట్ నుంచి త్రివేణి సంగమం వరకు భక్తులు చేరుకునేలా ఇసుక బస్తాలతో 30 మీటర్ల వెడల్పుతో ప్రత్యేక దారిని, ఆ దారిపై పందిరిని ఏర్పాటు చేయనున్నారు. ఈ దారులకు ఇరువైపులా భక్తులు స్నానాలు చేయొచ్చు. లేదంటే సంగమం వరకు చేరుకుని స్నానాలు చేసేవిధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఎక్కువ లోతు ఉన్న ప్రదేశాలకు భక్తులు వెళ్లకుండా బారికేడ్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తారు. షిఫ్ట్‌నకు 12 మంది తగ్గకుండా మొత్తం 25 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచనున్నారు.

సకల సౌకర్యాలు

భక్తులకు తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. విశ్రాంతి తీసుకోవడానికి, పిండాలు సమర్పించడానికి వీలుగా స్నానఘట్టాల దిగువన వెదురుతో చలువ పందిళ్లు, ప్రధాన ఆలయం నుంచి స్నానఘట్టాల వరకు ఉన్న రోడ్డును రద్దీకి తగ్గట్టుగా విస్తరించనున్నారు. కాళేశ్వరంలో చూడదగిన ప్రదేశాలు ఏమిటి, ఎలా వెళ్లాలి అనే వివరాలు తెలిపేలా ప్రధాన కూడళ్లలో బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

అర్హులకు 'ఇళ్లు' మంజూరయ్యేలా చూడాలి

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ.గౌతమ్



వీసీలో అదనపు కలెక్టర్ పింకేష్, అధికారులు

జనగామ రూరల్: ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు మంజూరయ్యేలా చూడాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ.గౌతమ్ అన్నారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, హౌసింగ్ పీడీ మాత్రునాయక్, డీఈలు బజరంగ్‌లాల్, సాయిరాంరెడ్డి, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు గ్రామాల్లో స్వీకరించిన ఎల్–1, ఎల్–2, ఎల్–3 దరఖాస్తులను పక్కాగా పరిశీలించి ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేయాలని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, తప్పులు లేకుండా నివేదిక ఇవ్వాలన్నారు. అనర్హులకు మంజూరు చేస్తూ బాధ్యులవుతారని హెచ్చరించారు. అంగన్‌వాడీ, ఆశ తదితర ఔట్ సోర్సింగ్ సిబ్బంది ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పథకానికి అర్హులేనని పేర్కొన్నారు. గతంలో మంజూరైన ఇళ్లు పక్కాగా నిర్మించుకునేందుకు, మరమ్మతులు చేపట్టేందుకు, అదనంగా పెంచుకునేందుకు, ఇంటిపై మరో ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేయొద్దన్నారు.

మాదిగ, మాదిగ ఉపకులాల కల సాకారం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కింది.. మాదిగ, మాదిగ ఉపకులాల కల సాకారమైందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఏ,బీ,సీ,డీలుగా రిజర్వేషన్ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి, సీఎం ఫ్లెక్సీకి ఎంపీ కడియం కావ్యతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన ఎస్సీల రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచి గతంలో చేవెళ్లసభలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జూలకుంట్ల లావణ్య శిరీష్‌రెడ్డి, పార్టీ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, మారుజోడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు చేయూత

- జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్



దరఖాస్తులు స్వీకరిస్తున్న సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్

పాలకుర్తి టౌన్: ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాలు అందజేసి చేయూతనందిస్తోందని జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్ తెలిపారు. బుధవారం ముత్తారం రైతు వేదికలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల దివ్యాంగులు, వృద్ధులకు సహాయ ఉపకరణాల దరఖాస్తుల స్వీకరణ శిబిరం ఏర్పాటు చేశారు. ఆయా మండలాల నుంచి 100 మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులకు ఉపకరణాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తాహెరాబేగం, మల్లీశ్వరి, సరళ, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రాజు, సుధాకర్, రాజశేఖర్, అలింకో కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి యువజన క్రీడోత్సవాలు

జనగామ రూరల్: పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 7, 8 తేదీల్లో జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర వరంగల్ జిల్లా అధికారి అన్వేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. యువకులకు వాలీబాల్, రన్నింగ్, షటిల్ సింగిల్స్ పోటీలు, యువతులకు కబడ్డీ, షటిల్ సింగిల్స్, రన్నింగ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్ల వయసు వారు అర్హులని, పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్, మెమొంటో అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9502126384, 9505496034 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయంలో వైవిధ్యం అవసరం

- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి
- రైతు మేళాలో కలెక్టర్ రిజ్వాన్ బాషా



కిసాన్‌మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్

రఘునాథపల్లి: వ్యవసాయంలో వైవిధ్యం అవసరం .. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, కంది, పెసర, మినుము, వేరుశనగ, కుసుమ, నువ్వులు పండించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, యాదాద్రి ఏరువాక కేంద్రం ఆధ్వర్యాన బుధవారం నిడిగొండలో నిర్వహించిన కిసాన్ మేళాలో ఆయన మాట్లాడారు. సాధారణ పంటలతో పాటు పాడి, కోళ్లు, చేపలు, పట్టు పురుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందని, వరిలో సన్న రకం సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. అనంతరం సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు, వివిధ రకాల పంట విత్తనాలు, పురుగు మందుల స్టాళ్లను సందర్శించారు. శాస్త్రవేత్తలు సంధ్యకిషోర్, సతీష్‌చంద్ర, అరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్ పంటల అధిక దిగుబడికి పాటించాల్సిన మెలకువలు, వరి సాగులో మేలైన దొడ్డు, సన్న రకాలు, కోతులు, అడవి పందులు, పక్షుల బారి నుంచి పంటలకు కాపాడుకోవడానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి రామారావునాయక్, తహసీల్దార్ మోహిన్‌ముజ్జిబ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, నాబార్డ్ మేనేజర్ చంద్రశేఖర్, ఏరువాక కేంద్రం, యాదాద్రి శాస్త్రవేత్తలు మమత, మధుశేఖర్, ఏఓ కాకి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు సుస్మిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల సందర్శన

ఖిలాషాపూర్ కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, సరుకుల నిల్వ గదిని పరిశీలించారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జీసీడీఓ గౌసియాబేగం, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, ఎస్‌ఓ జి.హేమలత ఉన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

జనగామ రూరల్ : పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, జాతీయ రహదారులు, నీటి పారుదల శాఖల అధికారులతో పెండింగ్ పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ ప్రక్రియ, నవాబుపేట రిజర్వాయర్, జాతీయ రహదారుల పెండింగ్ పనులు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన కలెక్టర్.. పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీ పెంచాలి

స్త్రీనిధి రుణాల రికవరీ పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ప్రధాన వీఓఏలు, డీపీఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాకు వస్తున్నారని, రుణాల రికవరీపై ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ వసంత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి కృపారాణి, స్త్రీనిధి ఆర్ఎం నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఇరుగ్గా నిర్మిస్తే ఇబ్బందులుంటాయి

- రైల్వే డీఆర్ఎంకు వినతి



డీఆర్ఎం కార్యాలయం వద్ద గ్రామస్తులు

రఘునాథపల్లి: నిడిగొండ రైల్వేట్రాక్ వద్ద ఆర్‌యూబీ అండర్‌గ్రౌండ్‌లో ఇరు వైపులా రోడ్డు ఒకే వెడల్పు నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు రైల్వే డీఆర్ఎం పంచల్ కేశవ్ వాన్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్‌లో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్‌యూబీ నిర్మాణంలో ఫతేషాపూర్ వైపు 30 ఫీట్లు, నిడిగొండ వైపు కేవలం 20 ఫీట్ల వెడల్పుతో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిడిగొండ వైపు ఇరుకుగా నిర్మిస్తే ఇబ్బందులు ఉంటాయని, రెండు వైపులా 30 ఫీట్లతో అండర్‌గ్రౌండ్ నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, నిడిగొండ పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి, ఫతేషాపూర్ మాజీ సర్పంచ్ ఎండీ హయత్‌అలీ, లింగాల జోగారెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ

స్టేషన్‌ఘన్‌పూర్: నులిపురుగుల నివారణకు కృషి చేయాలి.. ఇందుకు ఈనెల 10న చేపట్టే జాతీయ నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జునరావు సూచించారు. ఆయన బుధవారం ఇప్పగూడెం పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఆస్పత్రిలోని రిజిస్టర్లు, ఫైళ్లను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లలందరికీ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలని, ఎవరికైనా తప్పితే తిరిగి ఈనెల 17న కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రణీత, డాక్టర్ రమ్యకృష్ణ, పీఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రఘునాథపల్లి: సబ్ సెంటర్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు సిబ్బందిని ఆదేశించారు. కంచనపల్లి సబ్‌సెంటర్‌ను బుధవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ సెషన్‌ను పరిశీలించారు. అక్కడే ఉన్న తల్లులతో మాట్లాడారు. సబ్‌సెంటర్‌లో పిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు, అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలతో కలిగే లాభాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణకుమారి, ఏఎన్ఎం రాణి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి

జనగామ రూరల్: లంబాడా గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోతు రామకోటి అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందచేశారు. ప్రభుత్వ పాలన సాఫీగా సాగడానికి కలెక్టరేట్‌లో డీటీడబ్ల్యూఓ, ఏటీడబ్ల్యూఓ అధికారులనూ తక్షణమే నియమించాలని, జిల్లాలో గిరిజన భవన్ నిర్మించి సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట దేవర ఎల్లయ్య, లక్ష్మణ్ నాయక్, ధరావత్ శ్రీనివాస్ నాయక్, రమేశ్ నాయక్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

తీన్మార్ మల్లన్నపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు



హన్మకొండ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై సుబేదారి పోలీసు స్టేషన్‌లో రెడ్డి సంఘం ఫిర్యాదు చేసింది. ఈ నెల 2న హనుమకొండలో జరిగిన సభలో ఓసీ సామాజిక వర్గాలపై అనుచిత వ్యాఖ్యలు, అసభ్యపదజాలంతో దూషించిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి, నాయకులు నల్ల రాజిరెడ్డి, గంగిడి ప్రభాకర్ రెడ్డి, బండి నర్సింహారెడ్డి, దాడ జైపాండ్ రెడ్డి, తాటిపల్లి గణపతి రెడ్డి, దొంతి తిరుపతి రెడ్డి, దాసరి కేశవ రెడ్డి, ముల్లంగి నర్సింహారెడ్డి, రావుల రమేందర్ రెడ్డి, ప్రకాష్ చందర్ రెడ్డి, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ పోలీసులకు హైకోర్టు సమన్లు

● 21న కోర్టుకు హాజరుకావాలని ఆదేశం

వరంగల్ లీగల్ : ఓ కేసు విషయంలో హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన మిల్స్‌కాలనీ పోలీసులకు హైకోర్టు సమన్లు జారీ చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని రామన్నపేటకు చెందిన ఎలుకుర్తి వాల్మీకికి, తన కుటుంబ సభ్యులకు ఖిలా వరంగల్‌లోని దూపకుంటలో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి విషయంలో గొడవల కారణంగా శివనగర్‌కు చెందిన బత్తుల సంపత్, ఆతడి కుమారుడు సంతోష్‌పై వాల్మీకి, ఆతడి కుటుంబ సభ్యులు గతంలో వరంగల్ కోర్టులో దావా వేశారు. ఈ విషయంలో వాల్మీకి చెందిన వ్యవసాయ భూమి పైకి వెళ్లకుండా న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సంపత్, ఆతడి కుమారుడు కోర్టు ఉత్తర్వులు పట్టించుకోకుండా వాల్మీకి వ్యవసాయభూమిలోకి వెళ్లడంతో ఆతడు హైకోర్టును ఆశ్రయించాడు. వెంటనే హైకోర్టు వాల్మీకి, ఆతడి కుటుంబానికి వరంగల్ సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు రక్షణ కల్పించాలని మిల్స్‌కాలనీ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ఉత్తర్వుల కాపీని తీసుకుని వాల్మీకితో పాటు న్యాయవాది ఎలుకుర్తి ఆనందమోహన్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ వెంకటర్మణను కలిసి తమకు రక్షణ కావాలని పూర్తి వివరాలు వెల్లడించారు. కాగా, సీఐ వెంకటర్మణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు వాల్మీకి, ఆతడి కుటుంబీకులకు రక్షణ కల్పించకపోవడమే కాకుండా బత్తుల సంపత్ ఫిర్యాదు మేరకు న్యాయవాది ఆనందమోహన్, వాల్మీకి, ఆతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. దీంతో వారు మరోసారి హైకోర్టును ఆశ్రయించగా ఈనెల 21న మిల్స్‌కాలనీ పోలీసులు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది.

రెడ్డి చికెన్ సెంటర్ Cell: 9989299661

SAKSHI
కావలెను
వరంగల్ యూనిట్ పరిధిలో
అసిస్టెంట్ సర్క్యులేషన్ ఆఫీసర్ (ACO) గా
పని చేయుటకు ఆసక్తిగల యువకులు కావలెను.
అర్హత : ఇంటర్ పాస్ (మార్కెటింగ్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత)
వయస్సు : 19 నుండి 35 సంవత్సరాలు
అనుభవం: ఇతర దినపత్రికలలో సేల్స్ విభాగంలో పనిచేసినవారు, వివిధ కంపెనీలలో మార్కెటింగ్ రంగాలలో పనచేసిన వారు, కొత్తవారు కూడా దరఖాస్తు చేయవచ్చును.
ఆసక్తిగలవారు తేది: 06-02-2025 గురువారం రోజున ఉ॥ 11 గం॥ల నుండి 2 గం॥ల లోపు బయోడేటా, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, జిరాక్స్ సర్టిఫికెట్లతో సంప్రదించండి.
ఇంటర్వ్యూ జరుగు ప్రదేశము :
సాక్షి సిటీ కార్యాలయం, ఇ.నెం. 2-5-389, శ్రీ వేంకటేశ్వర కాలని, కోర్టు వెనకాల, నక్కలగుట్ట, హనుమకొండ.
మేనేజర్ (సర్క్యులేషన్): 7036166622

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■హౌస్, ఫ్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేయుటకు అమౌంట్ ఇప్పించబడును. Cibil అవసరం లేదు. Cont: 8341479342. [WA-7553]

BUSINESS SERVICES
■ మీ బంగారం మరియు ముత్యాల్, మార్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]

WANTED
■ఓమేగా హాస్పిటల్‌లో వృద్ధులను, పేషంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662 / 8977639663 [SCA25001467]

ఈ పత్రికలో ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్వసించి ఆర్థికపరమైన, ఇతర ఏ విధమైన లావాదేవీలు జరిపినా వాటికి పూర్తిగా ప్రకటనదారులదే బాధ్యత. ఫలితాలకు సాక్షి యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారులు, పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మహత్తర ఘట్టం.. మహాకుంభాభిషేకం

కాళేశ్వరం దేవస్థానంలో రేపటి నుంచి 9వ తేదీ వరకు.. | 1982లో జీర్ణోద్ధారణ తరువాత మళ్లీ ఇప్పుడే..

● మూడు రాష్ట్రాల నుంచి భారీగా తరలిరానున్న భక్తజనం
● ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయశాఖ



గోపురానికి పరంజాతో మెట్ల మార్గం



కాళేశ్వరం గర్భగుడిలో స్వామివార్ల ద్విలింగాలు

కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో మహత్తర ఘట్టం మహాకుంభాభిషేకానికి దేవాదాయశాఖ శ్రీకారం చుట్టింది. ఈనెల 7,8,9 తేదీల్లో ఈ కార్యక్రమం వైభవోపేతంగా జరిపించడానికి ఏర్పాట్లు పూర్తి చేసింది. మహత్తర వేడుకను వీక్షించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు.

42 ఏళ్లకు పునర్వైభవం..

42 ఏళ్ల తరువాత మహాకుంభాభిషేకంతో దేవస్థానంలోని ప్రధాన దేవతామూర్తికి పునర్వైభవం రానుంది. 1982లో జీర్ణోద్ధారణ సమయంలో శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థస్వామివారిచే మహాకుంభాభిషేక ఘట్టాన్ని అప్పటి రవాణాశాఖ మంత్రి జువ్వాడి చొక్కారావు, ఆ బృందంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పటి నుంచి కాళేశ్వరం దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతోంది. ఈక్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ.. తెలంగాణలోని దేవాలయాల్లో కుంభాభిషేకం జరపాలని అసెంబ్లీలో ప్రసంగించారు. దీంతో మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మొదట కాళేశ్వరంలో జరపాలని దేవాదాయశాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ ఈ.శ్రీధర్ మహాకుంభాభిషేకం నిర్వహించడానికి పలుమార్లు సమీక్షలు జరిపి శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థస్వామివారి ఆశీస్సులతో ముహూర్తం ఖరారు చేశారు. ఈ ఘట్టం వారి అనుబంధపీఠం ఆంధ్రప్రదేశ్‌లోని తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానందసరస్వతి వారి చేతుల మీదుగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

1982లో పూజకు వచ్చా..



1982లో ఆలయంలో జీర్ణోద్ధారణ పూర్తి చేసిన తరువాత మహాకుంభాభిషేక కార్యక్రమానికి వచ్చా. మా మామ, అప్పటి చైర్మన్ వెంకట సర్వయ్యశర్మ పూజకు బుత్విక్‌లతో కలిసి వచ్చాం. ఆ తర్వాత నేను కాళేశ్వరం దేవస్థానంలో అర్చకుడిగా ఉద్యోగంలో చేరా. మళ్లీ రెండోసారి 42 సంవత్సరాల తరువాత నా ద్వారా మహాకుంభాభిషేకం జరిగే అవకాశం కలిగింది.

త్రిపురారి కృష్ణమూర్తిశర్మ,
ప్రధాన అర్చకుడు, కాళేశ్వరం దేవస్థానం

ఆలయ కీర్తి మరింత పెంపు..



మహాకుంభాభిషేకంతో దేవస్థానం కీర్తి మరింత పెరుగుతుంది. మహాకుంభాభిషేకం జరిగిన తరువాత దర్శనాలు చేసుకోవాలి. 1,180 కలశాలతో పూజ జరుగుతుంది. ఈ మహాఘట్టాన్ని తిలకించి దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుంది.

పనకంటి ఫణీంద్రశర్మ,
ఉపప్రధాన అర్చకుడు

ఏర్పాట్లు పూర్తి..



కాళేశ్వరం దేవస్థానంలో మహాకుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గోపురాలకు పరంజాతో మెట్లు, పూలతో డెకరేషన్, విద్యుత్‌కాంతులు ఏర్పాటు చేస్తున్నాం. అధికారుల సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

శనిగెల మహేశ్,
ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

ఉద్యోగ కల్పన లక్ష్యం కావాలి..

● కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ఉద్యోగం ఒక్కటే కాదు.. ఉద్యోగ కల్పన లక్ష్యంగా ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని సెనేట్‌హాల్‌లో ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థులతో హైదరాబాద్ టీ హబ్ ప్రతినిధులు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కొత్త ఆలోచనలతో సంస్థల స్థాపనకు కృషిచేయాలన్నారు. విశ్వవిద్యాలయం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రణాళికలున్నాయన్నారు. ఆదిత్యా కె హబ్‌లో ఏర్పాటు ఉంటాయన్నారు. కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ విజయం కేవలం తరగతిగది చదువులతో సరిపోదన్నారు. చుట్టూ ఉన్న మార్కెట్ ఇండస్ట్రీ పోకడలను గమనించి ముందుకెళ్లాలన్నారు. టీ హబ్ ప్రతినిధులు త్రివిక్రమ్ సాయి, అభినయ్ స్వరూప.. పవర్ పాయింట్ ద్వారా నూతన ఆవిష్కరణలకు అంకురార్పణలపై వివరించారు. కేయూ యాక్సిల యూనిట్ కోఆర్డినేటర్, రూసా నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్ రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. ప్రసాద్, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆ. శిల్ప, కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రేరేపిత వైఖరి కలిగి ఉండాలి..

విద్యార్థి ప్రేరేపిత వైఖరి కలిగి ఉండాలని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలో కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల,సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్‌డిజైన్ బాలనగర్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆరువారాల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఇన్ డిటా స్టాటిస్టిక్స్ అండ్ అనలిటిక్స్ అండ్ ఆటోకాడ్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు స్కిల్స్ పెంచుకోవాలన్నారు. సీఐటీడీ డైరెక్టర్ ఉదయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పనిచేసినప్పుడు మాత్రమే ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుందన్నారు. కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణను వినియోగించుకోవాలన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రమణ మాట్లాడుతూ ఈ శిక్షణకు వంద మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో అంబులెన్స్ ఏర్పాటు



అంబులెన్స్‌తో మార్కెట్ కార్యదర్శి నిర్మల, వ్యాపారులు

వరంగల్: రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, హమాలీ, ఇతర కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా వ్యవసాయ మార్కెట్ కమిటీ వరంగల్ వినతి మేరకు బుధవారం మార్కెట్ యార్డులో 108 వాహనం(అంబులెన్స్) ఏర్పాటు చేసినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల తెలిపారు. అంబులెన్స్ సౌకర్యం కోసం 87126 32400 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రేడ్ 2 కార్యదర్శులు ఎస్.రాము, జి.అంజిత్‌రావు, సహాయ కార్యదర్శి రాజేందర్, వరంగల్ చాంబర్ కాటన్ సెక్షన్ కార్యదర్శి కె.నాగభూషణం, ఖరీదు దారులు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

● చలివాగులో పడి విద్యార్థి మృతి
● అధికారుల నిర్లక్ష్యమే కారణం అంటున్న కుటుంబ సభ్యులు
● మృతదేహంతో హాస్టల్ ఎదుట ఆందోళన



సంతోష్ (ఫైల్)



హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

మొగుళ్లపల్లి : సరదాగా ఈత కొడదామని చలివాగులోకి వెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం.. టేకుమట్ల మండలం చలివాగుపల్లి గ్రామానికి చెందిన పురాణం సంతోష్ (14) మొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటున్నాడు. మూడు రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉంటున్నాడు. బుధవారం ఉదయం హాస్టల్‌లో టిఫిన్ చేసి పాఠశాలకు వెళ్లకుండా తన స్నేహితుడు సాంబశివతో కలిసి ఈత కోసం గ్రామ శివారులోని చలివాగు వద్దకు వెళ్లారు. స్నేహితుడు ఒడ్డు వద్దనే ఉండగా, సంతోష్ లోతు ప్రదేశానికి వెళ్లి ఈత రాకపోవడంతో ఒక్కసారిగా నీటిలో మునిగాడు. 'నన్ను కాపాడు' అంటూ కేకలు వేసినా ఎవరూ లేకపోవడం.. అప్పటికే నీట మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మత్స్య కార్మికులను వాగులో దింపి వెతకగా మృతదేహం లభ్యమైంది. అప్పటికే సంతోష్ కుటుంబ సభ్యులు ఘటనస్థలానికి చేరుకున్నారు. పోలీసులు పోస్టుమార్టం కోసం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించే క్రమంలో కుటుంబ సభ్యులు తరలించకుండా అంబులెన్స్‌ను అడ్డుపడి గొడవపడ్డారు. సంతోష్ మృతదేహాన్ని ఎస్సీ హాస్టల్ ఎదుట ఉంచి వార్డెన్ నిర్లక్ష్యం మూలంగానే తన కుమారుడు చనిపోయాడని, వార్డెన్, హాస్టల్ సిబ్బంది పట్టించుకుంటే చనిపోయేవాడు కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సుమారు రెండు గంటలపాటు ఆందోళన చేశారు. కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని, విచారణ చేపట్టి బా ధ్యులపై తీసుకుంటామని ఆందోళన విరమించారు.

ఏడాదిన్నర క్రితం కొడుకును కాపాడబోయి తండ్రి మృతి

2023 సెప్టెంబర్ 09వ తేదీన తండ్రి పురాణం భవాని తన కుమారుడు సంతోష్‌ను తీసుకుని బేడ మట్ల పరిధిలోని చలివాగులో చేపలవేటకు వెళ్లాడు. తండ్రి చేపలు పడుతుండగా నీటిలోకి దిగిన సంతోష్ అదుపుతప్పి వాగులో పడిపోగా, తండ్రి భవాని దూకి కుమారుడిని కాపాడాడు. ఆ ప్రయత్నంలో తండ్రి మునిగి చనిపోయాడు. దీంతో తల్లి, కుమారుడిని చలివాగు బలితీసుకోవడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

తాత అంత్యక్రియలకు వచ్చి చెరువులో మునిగి మనుమడు మృతి



రంజిత్ (ఫైల్)

దుగ్గొండి: తాతయ్య అంత్యక్రియలకు మునిగిన అనంతరం చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగి మనుమడు మృతిచెందాడు. ఈ ఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చాపలబండ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన వృద్ధుడు పిట్టల మల్లయ్య అనారోగ్యంతో మంగళవారం ఉదయం చనిపోయాడు. సాయంత్రం అంత్యక్రియలు పూర్తయ్యాయి. అనంతరం కుటుంబ సభ్యులంతా చెరువులో స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో మల్లయ్య మనుమడు పిట్టల రంజిత్(30) చెరువులోకి దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు బయటకి తీసి చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య అనూష, ఏడాదిన్నర కూతురు ఉంది. తండ్రి పిట్టల కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీతారాం వెంకటేశ్వర్లు తెలిపారు. ఒకే ఇంటిలో ఒకేరోజు తాత, మనుమడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● నీర్మాల, సింగరాజుపల్లి గ్రామాల మధ్య ఘటన
● మరొకరికి గాయాలు



ఉదయ్‌కుమార్ (ఫైల్)

దేవరుప్పుల : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాల, సింగరాజుపల్లి గ్రామాల సరిహద్దులో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నీర్మాలకు చెందిన కల్లుల ప్రవీణ్ తన కారులో సింగరాజుపల్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సరిహద్దులో కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఒక టైర్ ఊడిపోయినా ఆదే వేగంతో రోడ్డుపైకి దిగి ఎదురుగా బైక్‌పై వస్తున్న సింగరాజుపల్లికి చెందిన తాళ్లపల్లి ఉదయ్ కుమార్ (24)ను ఢీకొన్నాడు. దీంతో ఉదయ్‌కుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా తిర్మలగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఘటనా స్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుడిమెలిగె.. భక్తి ఉప్పొంగె



సమ్మక్క గద్దె వద్ద భక్తుల మొక్కులు



సమ్మక్క గుడిలో గుడిమెలిగె పూజలు నిర్వహిస్తున్న పూజారులు

● మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● అమ్మవార్లను దర్శించుకున్న భక్తజనం

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం, కన్నెపల్లి ఆలయాల్లో బుధవారం గుడిమెలిగె పండుగ ఆదివాసీ సంప్రదాయ ప్రకారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పూజారులు ఆలయాలను శుద్ధి చేసి పసుపు, కుంకుమతో అలంకరించారు. మేడారంలోని సమ్మక్క గుడిలోని అమ్మవారి శక్తిపీఠాన్ని అలికి ముగ్గులు వేశారు. కన్నెపల్లి సారలమ్మ గుడిలో వడెరాలను పసుపు, కుంకుమతో అలంకరించారు. అమ్మవార్లకు యాటలను మొక్కుగా సమర్పించారు. గుడిమెలిగె పండుగతో తొలి పూజాకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో పూజారులు సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పూజారులు సిద్దబోయిన మునీందర్, భోజారావు, మహేశ్, కొక్కెర కృష్ణయ్య, దూపదడ్డె నాగేశ్వర్ రావు, సారలమ్మ పూజారి కాక సారయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమ్మవార్లకు భక్తుల మొక్కులు..

మేడారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం గుడిమెలిగె పండుగ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి మేడారం వచ్చారు. జంపన్నవాగు వద్ద షవర్ల కింద స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో పుట్టు వెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్ల గద్దెల వద్ద కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మొదలైన భక్తుల రద్దీ రాత్రి వరకు కొనసాగింది. పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ట్రాఫిక్ జామ్, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు నిర్వహించారు.

అమ్మవార్లను దర్శించుకున్న జనక్ ప్రసాద్..

మేడారం సమ్మక్క, సారలమ్మను తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు సిద్దబోయిన రమేశ్, భోజారావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎడ్లబండి దారుల మరమ్మతులకు రూ.80 లక్షలు..



బయ్యక్కపేట – కాల్వపల్లి ఎడ్లబండ్ల దారి

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం మినీ జాతరకు వచ్చే ఎడ్లబండి దారుల మరమ్మతులకు ప్రభుత్వం రూ.80 లక్షలు కేటాయించింది. ఈ నిధులను కలెక్టర్ దివాకర టీఎస్ ఐటీడీఏ పీఓ దల చేసి అటవీ శాఖ అధికారులకే మరమ్మతులు అప్పగించారు. గతంలో ఈ మరమ్మతులను విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) లకు కేటాయించేవారు. అయితే ఈ దారులు అటవీ ప్రాంతాలలో మధ్యలో ఉండడంతో ఆ శాఖ అధికారుల అభ్యంతరాలతో ఇబ్బందులు తలెత్తేవి. ఈ నేపథ్యంలో ఈ దఫా సదరు దారుల మరమ్మతులను కలెక్టర్ దివాకర టీఎస్.. ఆ శాఖ అధికారులకే అప్పగించారు. కానీ జాతర సమీపిస్తున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఏ మేరకు పూర్తయ్యాయో తెలియడం లేదని భక్తులు పేర్కొంటున్నారు. బయ్యక్కపేటలో ఎస్సీ కాలనీ నుంచి తాళ్లతోగు వరకు దారి మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు చేపట్టకపోవడంతో దేవరగుట్ట నుంచి ఎడ్లబండ్ల ద్వారా అమ్మవారిని తీసుకువచ్చే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని బయ్యక్కపేట పూజారులు తెలిపారు. ఎడ్లబండ్ల దారుల మరమ్మతులను అసంపూర్తిగా చేశారా.. లేక అసలే చేపట్టలేదా అనే అంశం ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తప్ప తెలియదని పలువురు భక్తులు పేర్కొంటున్నారు.

మరమ్మతులు చేయాల్సిన ఎడ్లబండ్ల దారులు పొడవు- విడుదలైన నిధులు

- కాల్వపల్లి – కన్నెపల్లి 4.5 కి.మీ – రూ.5 లక్షలు
- బయ్యక్కపేట – కాల్వపల్లి 6 కి.మీ– రూ.5 లక్షలు
- ఊరట్టం – కొండాయి 10 కి.మీ– రూ.7.50 లక్షలు
- బయ్యక్కపేట ఎస్సీ కాలనీ – తాళ్లతోగు 3 కి.మీ– రూ.5 లక్షలు
- ఐలాపూర్ – కాల్వపల్లి 5.5 కి.మీ– రూ.5.50 లక్షలు
- సమ్మక్క గుడి ఐలాపూర్ – మంకిడి పోచమ్మ వాగు 2.5 కి.మీ– రూ.2.50 లక్షలు
- ఐలాపూర్ – రెడ్డిపల్లి – రూ.6 లక్షలు
- కొండాయి – ఐలాపూర్ – రూ.20 లక్షలు
- ఐలాపూర్ – కొండాయి –రూ.5.50 లక్షలు
- కొండాయి – ఎల్బాకల –రూ.5.50 లక్షలు
- ఐలాపూర్ – చల్వాయి –రూ.4.50 లక్షలు

వైద్యం వికటించి బాలుడి మృతి?

● బంధువుల ఆరోపణ
● ఆస్పత్రి ఎదుట ఆందోళన



సిద్దార్థ మృతదేహం



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

తొర్రూరు: వైద్యం వికటించడంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన తొర్రూరు పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన దాసరోజు సిద్దార్థ (15) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి వేణు కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా తల్లి నాగమణి టైలరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో సిద్దార్థ మూడు రోజులుగా జ్వరం, జలుబుతో బాధపడుతున్నాడు. ఎంతకీ తగ్గకపోవడంతో బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా పరీక్షలు చేశారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు ఇంజక్షన్ వేయగా కొద్ది సేపటికే మృతి చెందాడు. ఇంజక్షన్ వికటించడంతోనే బాలుడు మృతి చెందాడంటూ బంధువులు, గ్రామస్తులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆగ్రహంతో వైద్యుడిపై దాడి చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు బాధితులకు అండగా ఆందోళనలో పాల్గొన్నారు. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని పేర్కొంటూ బాలుడి మృతదేహాన్ని ఆస్పత్రిలోనే ఉంచి అదేరోజు రాత్రి వరకూ ఆందోళన కొనసాగించారు. సీఐ గణేశ్, ఎస్సై ఉపేందర్ తోపాటు సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ ఘటనపై వివరణ కోరేందుకు ఆసుపత్రి వైద్యుడికి ఫోన్ చేయగా స్పందించలేదు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

● నీటి సంపులో పడి చిన్నారి మృతి
● టీక్యా తండాలో ఘటన



లిఖిత (ఫైల్)

నెల్లికుదురు: తండ్రి పని నిమిత్తం బయటకు వెళ్లాడు.. తల్లి ఇంట్లో పని చేస్తోంది. ఈ సమయంలో ఆ చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటోంది. అలా ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడి మృతి చెందింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మదనతుర్తి శివారు టీక్యా తండాలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన గుగులోత్ మోతీలాల్, మౌనిక దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ క్రమంలో మోతీలాల్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. పెద్దకూతురు లిఖిత (2) ఇంటి ముందు ఆడుకుంటోంది. కూతురు ఆడుకుంటుందని భావించిన మౌనిక ఇంట్లో పని చేసుకుంటోంది. ఈ క్రమంలో లిఖిత ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది. ఎవరూ గుర్తించకపోవడంతో మృతి చెందింది. కొద్ది సమయం తరువాత మౌనిక బయటకు వచ్చి చూడగా లిఖిత కనిపించలేదు. దీంతో ఆ నుమానం వచ్చి నీటి సంపులో వెతకగా విగతజీవిగా కనిపించింది. చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతదేహం మీద పడి గుండెలవిసేలా రోదించారు.